క్లుప్తంగా

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు సర్వే



బుచ్చిరాజుపాలెంలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్టు సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ బి. గీత తెలిపారు. 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో శనివారం చేపట్టిన సర్వేలో ఆమె స్థానిక సమగ్ర శిక్ష సిబ్బందితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్య అందించడంతో పాటు వారికి ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు అందించేలా సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా భవిత కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం టీచర్లు పి. ధనలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

కిరణ్ దాతృత్వం



షేక్ బీబీకి నిత్యావసర సరకులు అందిస్తున్న దొడ్డి కిరణ్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో డీకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దొడ్డి కిరణ్ నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరకులు అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇక్కడి నాగేంద్రకాలనీకి చెందిన షేక్ బీబీ కొన్నేళ్ల కిందట భర్తను పోగొట్టుకుంది. చిన్నచిన్న పనులు చేసుకుంటూ కుమార్తెతో జీవనం గడుపుతోంది. ఆ కుటుంబం పరిస్థితి తెలుసుకున్న కిరణ్ నెలకు సరిపడా నిత్యావసర సరకులు శనివారం అందించారు. కార్యక్రమంలో దేవుడు, ప్రకాష్,నరేష్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో శ్రీధర్ దంపతులు



ఆలయంలో పూజలు చేస్తున్న శ్రీధర్ దంపతులు

విశాఖ విద్య: సింహాచలం శ్రీవరాహ లక్ష్మీ నరసింహ స్వామివారిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సతీ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. శ్రీధర్ దంపతులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రతన్‌రాజ్‌కు ఘన సత్కారం



హెచ్‌పీసీఎల్ ఈడీ రతన్‌రాజ్‌ను సత్కరిస్తున్న సొసైటీ పాలక సభ్యులు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా పనిచేసి శుక్రవారం పదవీ విరమణ పొందిన రతన్‌రాజును హెచ్‌పీసీఎల్ సొసైటీ పాలక వర్గ సభ్యులు,ప్రతినిధులు శనివారం ఘనంగా సత్కరించారు. సంస్థ పరిపాలన భవనం వద్ద జరిగిన కార్యక్రమంలో రతన్‌రాజ్‌కు సొసైటీ అధ్యక్షుడు శాలువా కప్పి, శ్రీకృష్ణుడి ప్రతిమను అందించారు. సొసైటీ పాలక వర్గ సభ్యులు సర్వసిద్ధి శ్రీనివాస్‌రావు,ఎస్.పైడిరాజు,వై.ఎ. భాస్కరరావు,వై.అప్పలరాజు,చెల్లిబోయిన శ్రీను,ధనంజయ్,చొప్ప రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార కేంద్రాలుగా ఫుట్‌పాత్‌లు

- ఫుట్‌పాత్‌లపై నడవడానికి వీల్లేని వైనం
- చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు



హిమాచల్‌నగర్ ఎదురుగా సర్వీస్ రోడ్డులో..

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని ప్రధాన రోడ్లకు ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌లు వాణిజ్య కేంద్రాలుగా మారాయి. జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా,కమర్షియల్ ట్యాక్స్ చెల్లించకుండానే దర్జాగా పలువురు వ్యాపారాలు సాగిస్తున్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించేయడంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య అధికారుల దృష్టిలో ఉన్నా వారు పట్టించుకోకపోవడంతో రోజు రోజుకూ ఫుట్‌పాత్‌లపై దుకాణాల సంఖ్య పెరుగుతోంది.



జింక్ ఆంజనేయ స్వామి ఆలయానికి ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌పై వస్త్రాల వ్యాపారం

ఇదీ పరిస్థితి

ఐదేళ్ల కిందట జింక్ నుంచి సింథియా వరకు ప్రధాన సర్వీసురోడ్డుకు ఆనుకుని ఇరువైపులా సుమారు రూ.23 లక్షలతో ఐదు అడుగుల వెడల్పుతో ఫుట్‌పాత్‌లను జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు.దీంతో ఆయా ప్రాంత పాదచారులు, ప్రతి రోజు వాకింగ్ చేసే వారికి ఈ ఫుట్‌పాత్‌లు ఎంతో సౌకర్యవంతంగా ఉండేవి. అయితే నేడు ఆ పరిస్థితి ఇక్కడ లేదు.వాకర్స్,పాదచారులు నడిచే ఫుట్‌పాత్‌లు వాణిజ్య కేంద్రాలుగా మారాయి.పలువురు వ్యాపారాలు ఫుట్‌పాత్‌లను తమ సొంత స్థలాలుగా భావిస్తున్నారు.పాన్‌షాప్‌లు,రడీమేడ్ వస్త్ర వ్యాపారాలు,ఫాస్టఫుడ్ సెంటర్‌లు,చికెన్ సెంటర్లు నడుపుతున్నారు.జీవీఎంసీకి ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదు. వీరి వల్ల పాదచారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.



మల్కాపురం సర్వీస్ రోడ్డు వద్ద ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన పాన్‌షాప్

ఇబ్బందిగా ఉంది



జింక్ నుంచి మల్కాపురం వరకు సర్వీసురోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై దుకాణాలు వెలిశాయి. వ్యాపారాలు తమ సొంత స్థలం అన్నట్టు అడిగిన వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. వాకింగ్‌కు వెళ్లే మేము ఫుట్‌పాత్‌పై కాకుండ సర్వీసు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి కలుగుతుంది. సమస్యపై అధికారులు స్పందించాలి.

– ఆదారి హరీష్, పాదచారు

అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా..



సర్వీసురోడ్డుకు ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌లపై అనధికారికంగా వెలసిన వ్యాపారాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులకు వివరించాం. అయినా వారి నుండి నేటి వరకు ఎలాంటి స్పందన లేదు.అధికారులు స్పందించక పోవడం వల్ల సమస్య రోజు రోజుకూ అధికం అవుతుంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ వ్యాపారాలకు కళ్లెం వేయాలి.

– సత్తిబాబు, పాదచారు

గాలివానకు కూలిన చెట్లు



శ్రీరామ్‌నగర్‌లో గాలివానకు కూలిన భారీ వృక్షం



గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్‌లో కూలిన తాటి చెట్టు

గోపాలపట్నం: నగరంలో శుక్రవారం అర్ధరాత్రి కురిసిన గాలివానకు 92వ వార్డు గోపాలపట్నం శ్రీరామ్‌నగర్‌లో చెట్లు కూలాయి. ఇక్కడి చిరు దుకాణం పాక్షికంగా ధ్వంసమైంది. ఇక్కడి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిలో భారీ చెట్టు నేలకొరిగింది. దీంతో పక్కనే ఉన్న బండి దుకాణం దెబ్బతింది.

తప్పిన ప్రమాదం : గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్‌లో తాటిచెట్టు కూలిపోయింది. ప్రహరీ గోడ పైనుంచి కూలినట్లయితే విద్యుత్ తీగలపై పడి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. అదృష్టవశాత్తు గ్రౌండ్‌లోకి పడటంతో ప్రమాదం తప్పింది. రాత్రి వేళ చెట్లు కూలడం.. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉరుములు.. మెరుపులు



పారిశ్రామిక ప్రాంతంలో మెరుపు తాకిడి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన జడివాన కురిసింది. పెద్ద పెద్ద శబ్దాలతో వచ్చిన ఉరుములకు మంచి నిద్రలో ఉన్న జనం ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. ఏకధాటిగా వర్షం కురవడంతో ఎండ వేడిమికి అల్లాడిన ప్రజలు సేద తీరారు. భానుడి ప్రతాపానికి విలవిల్లాడిన పారిశ్రామిక ప్రాంత వాసులు వర్షాన్ని చూసి మురిసిపోయారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



గ్రంథాలయాన్ని శుభ్రం చేస్తున్న చిన్నారులు, అతిథులు

మల్కాపురం: మన చుట్టుపక్కల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్‌పీసీఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయ ఆవరణ, పరిసర ప్రాంతాలను శనివారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని, పరిశుభ్రతతో ఆరోగ్య వంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులతో కలిసి చిన్నారులు గ్రంథాలయ ఆవరణాన్ని శుభ్రపరిచారు. రచయిత కరుకు సత్తిరాజు, గ్రంథాలయాధికారి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ ఆంక్షలు



ఎన్‌ఎస్‌టీఎల్ ముందు హైవేపై ఏర్పాటు చేసిన బారికేడ్లు



బారికేడ్లు తొలగించి రోడ్డు దాటి వస్తున్న ద్విచక్ర వాహన చోదకులు

- ఎన్‌ఎస్‌టీఎల్ రోడ్డులో బారికేడ్ల ఏర్పాటు
- వాటిని తొలగించి రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సమీపంలోని ఎన్‌ఎస్‌టీఎల్ వద్ద రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఎన్‌ఎస్‌టీఎల్ ప్రధాన గేటు ముందు హైవేపై యూ టర్న్ ఉండటంతో వాహనాల రాకపోకలు ఇబ్బందికరంగా మారింది. 52వ వార్డు శాంతినగర్ వైపు నుంచి 90వ వార్డు బుచ్చిరాజుపాలెం పరిసర కాలనీలకు వెళ్లే పాదచారులు, వాహన చోదకులు ఎన్‌ఎస్‌టీఎల్ వద్ద యూటర్న్ తీసుకొని వెళ్తున్నారు. ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్, బస్టాండ్ వైపు నుంచే వేగంగా వచ్చే వాహనాలతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుంది. దీంతో ట్రాఫిక్ పోలీసులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఎన్‌ఎస్‌టీఎల్ ప్రధాన గేటు ముందు అటు నుంచి ఇటువైపుకు వాహనాలు రాకుండా మధ్యలో బారికేడ్లు ఏర్పాటు చేశారు.

ప్రమాదాలు జరుగుతున్నా.. మార్పేది?

రోడ్డు ప్రమాదాల కట్టడికి ట్రాఫిక్ పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ.. కొంతమంది వాహన చోదకుల్లో మార్పు కనిపించడం లేదు. బారికేడ్లను తొలగించి, అటు నుంచి ఇటువైపునకు ద్విచక్ర వాహనాలతో వస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న చోట ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బారికేడ్లు ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహన చోదకులు ఇలా అడ్డదిడ్డంగా బారికేడ్లు దాటుకొని వస్తుండటం వల్ల ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.

ఎన్‌ఎస్‌టీఎల్ ప్రధాన గేటు ముందు మంచి ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేసినప్పటికీ, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థ కావడంతో వారి అనుమతులు కూడా తీసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నందున, పోలీసులు మరిన్ని ట్రాఫిక్ ఆంక్షలు విధించేందుకు ముందడుగు వేయలేని పరిస్థితులు ఉన్నాయి.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు



హాజరైన పలు పార్టీల నాయకులు

డీసీపీ–2 సత్తిబాబు

సింహాచలం: సార్వత్రిక ఎన్నికల కౌంటిగ్ నేపథ్యంలో అల్లర్లు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని నగర లా అండ్ ఆర్డర్ డీసీపీ సత్తిబాబు సూచించారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతో శనివారం సాయంత్రం సింహాచలం దరి బాలాజీనగర్‌లోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో డీసీపీ సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్ రోజు, ఆతర్వాత రోజుల్లో కూడా ఎలాంటి అల్లర్లకు పాల్పడినా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 144 సెక్షన్ ఉంటుందని, దాని కణుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. గెలుపు తర్వాత 4,5,6 తేదీల్లో ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. డీజేలు, సౌండ్ సిస్టమ్ పెడితే వెహికల్స్ సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఎవరైతే ఆర్గనైజ్ చేశారో వారిని అరెస్టు చేస్తామని హెచ్చరించారు. అలాగే బాణసంచా కాల్చినా.. విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే సోషల్ మీడియాలో ఎలాంటి కామెంట్లు చేయకూడదన్నారు. రౌడీషీట్లు ఓపెన్ చేయడానికి కూడా వెనుకాడబోమన్నారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా తమ కార్యకర్తలకు ఈ విషయాలని చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, గోపాలపట్నం సీఐ సురేష్ పాల్గొన్నారు.

పింఛన్‌దారుల సంఘ నూతన కార్యవర్గం

పెందుర్తి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోషియేషన్ పెందుర్తి శాఖ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. చినముషిడివాడలోని పంచవటి కార్యాలయంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా అల్లం కృష్ణారావు, కార్యదర్శిగా వై.కామరాజు, కోశాధికారిగా కట్టా పాపారావు, అసోషియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.వి.వి.ఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా డి.భాస్కరరావు, ఎ.ఈశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా బి.రామునాయుడు, వై.జగన్నాథరావు, సభ్యులుగా సి.హెచ్. అప్పలనాయుడు, కె.అప్పారావు, ఎస్.కన్నరాజు, జి.రామానందం ఏకగ్రీవంగా నియమితులయ్యారు.

కమనీయం.. కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ బేడా మండపంలో ఉదయం 9.30గంటలకు స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంఐధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేష వస్త్రాలు అందజేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను బేడామండపంలోని వేదికపై అధిష్టంపజేసి 1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

జై హనుమాన్

- భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి
- అంజన్నకు ప్రత్యేక పూజలు



అంజన్నకు పూజలు నిర్వహిస్తున్న శ్రీధర్ తదితరులు



62వ వార్డులో అంజన్నకు పూజలు చేస్తున్న వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం నియోజకవర్గంలోని రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజలు వైభవంగా జరిగాయి. భక్తులు వేకువ జాము నుంచి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు పంచామృత, గంధ, విభూది, పండ్ల రసాలతో అభిషేకం, తమలపాకులతో అష్టోత్తరం, సింధూరంతో అర్చన జరిపారు.

- జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని రామాలయంలో శ్రీరామభక్తుడు కోరుకొండ శ్రీను ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఉత్సవాలకు వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి సింధూరోత్సవం, జెండా ఆవిష్కరణ గావించి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే కాకరలోవ బొబ్బిలి వీధిలో స్వామిని దర్శించుకుని అన్నసంతర్పణను ప్రారంభించారు. కార్యక్రమంలో గంటా వర్మ, దండి శ్యామ్, ముమ్మిన నూకరాజు, సందక గోవింద, కోరుకొండ నాని, రమణ నాయుడు, కామేష్, తిరుపతి, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురం, ప్రకాష్‌నగర్, ఎన్టీఆర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన పూజల్లో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని స్వామికి తమలపాకులతో అర్చన చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డుఅధ్యక్షుడు భీశెట్టి గణేష్, ఆయా గ్రామాభివృద్ధి సంఘాల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వెంకటాపురం మూడు గుడుల జంక్షన్ వద్ద ఆంజనేయుడు

అంజన్నకు విశేష పూజలు

విశాఖ విద్య: కరాసలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంజన్నకు ప్రత్యేకంగా ఆకుపూజ, అభిషేకం జరిపించారు. నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆంజనేయ స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీధర్ పేరిట గోత్రనామపూజలు చేసి, స్వామి ప్రసాదాలు అందజేశారు.104 ఏరియా, కంచరపాలెం శ్రీ యోగ సిద్ధ ఆంజనేయ స్వామి ఆలయాలను కూడా శ్రీధర్ దర్శించుకున్నారు.

వాడవాడలా హనుమజ్జయంతి వేడుకలు

గోపాలపట్నం: గోపాలపట్నం, కొత్తపాలెం, వెంకటాపురం ప్రాంతాల్లోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. గోపాలపట్నం బంక్ సమీపంలోని ఆలయంలో విశేష పూజలు చేశారు. వెంకటాపురం ఆలయంలోని పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

భారీ అన్నసమారాధనలు

మల్కాపురం: మల్కాపురం బస్టాప్ వద్ద గల ఆంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పిలక రామ్మోహన్‌రెడ్డి(రాము) ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. గారెలు మాలలుగా కట్టి స్వామికి అలంకరించారు. ఆలయ అర్చకులు హనుమాన్ జయంతి కథ వృత్తాంతాన్ని భక్తులకు వివరించారు. సాయంత్రం సుందరాకాండను భక్తులు ఆలపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బద్రీనాథ్, పీలా అనంత్‌కుమార్, మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు, జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం, దాడి సత్యనారాయణ(డిపో), బూస అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- జింక్ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రతినిధులు పూజలు జరిపించారు.
- 58వ వార్డు కుంచమ్మకాలనీ, గుల్లలపాలెంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో స్థానిక నాయకుడు కోరాడ శ్రీను పూజలు జరిపారు. ఆయా ఆలయాల వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.



40వ వార్డులో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు



విశేషాలంకరణలో వెంకటాపురం పంచముఖాంజనేయ స్వామి



మల్కాపురంలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కుంచమ్మ కాలనీలో అన్నదానం చేస్తున్న కోరాడ శ్రీను

త్వరితగతిన బీఆర్‌టీఎస్ విస్తరణ పనులు



బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–8 పరిధి అడవివరం నుంచి పాత గోశాల వరకు జరుగుతున్న బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రోడ్డు విస్తరణ పనులను శనివారం జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని, ముఖ్యంగా కాలువలు, కల్వర్టులతో పాటు రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలన్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. సింహాచలం దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రోడ్డుపై దుమ్ము, ధూళి లేవకుండా ఎప్పటికప్పుడు నీటిని చల్లాలని పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్‌ను, జోనల్ కమిషనర్ హైమావతిని ఆయన ఆదేశించారు.